తిరోగమనం

- తోటగరువు హైస్కూల్‌లో తగ్గిన విద్యార్థులు
- గత ఏడాది 480 మంది చేరితే ఈ సంవత్సరం 320 మందికే అడ్మిషన్లు
- మొత్తంగా గత విద్యా సంవత్సరం కంటే 90 మంది తగ్గుదల
- 13 మంది ఉపాధ్యాయులను తగ్గించేసిన కూటమి ప్రభుత్వం
- ఆందోళన చెందుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు


తోటగరువు హైస్కూల్

ఆరిలోవ : ఆరిలోవలోని తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తిరోగమన బాటలో పయనిస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం విద్యా విధానంలో చేస్తున్న మార్పులు కారణంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు, కొత్తగా చేరే విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. ఈ విధానాలతో పాఠశాల అన్ని విభాగాల్లో తరుగుదలతో సతమతమవుతోంది. వేల మంది విద్యార్థులున్న ఈ ప్రాంతంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఆదరణ తగ్గుతోంది. 2024–25 విద్యా సంవత్సరంలో ఉన్న ఉపాధ్యాయులు, విద్యార్థుల సంఖ్యతో పోల్చుకుంటే ప్రస్తుతం 2025–26 విద్యా సంవత్సరంలో వారి సంఖ్య తగ్గిపోయింది. ఈ ప్రాంతం భౌగోళికంగా, జనసాంద్రత పరంగా చాలా విశాలమైంది. ఆరిలోవ కాలనీ నుంచి తోటగరువు, రవీంద్రనగర్, ఆదర్శనగర్, కొండవాలు ప్రాంతాలతోపాటు విశాలాక్షినగర్, జోడుగుళ్ల పాలెం వరకు ఇదే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కావడం విశేషం. దీని పరిధిలో పది మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలున్నాయి. భగత్‌సింగ్ నగర్, సంతపాలెం, పెదగదిలి, అంబేడ్కర్‌నగర్,


తోటగరువు హైస్కూల్ తరగతి గదిలో విద్యార్థులు, ఉపాధ్యాయురాలు

తోటగరువు, గాంధీనగర్, ఎస్.ఐ.జి.నగర్, ఇందిరా నగర్ (హనుమంతవాక), సంజీవినగర్ (విశాలాక్షి నగర్), జోడుగుళ్లపాలెం ప్రాంతాల్లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిధిలో ఉన్నాయి. ఆయా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆరో తరగతి నుంచి ఈ హైస్కూలే ఆధారం. ఆయా పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరంలో ఐదో తరగతి రిలీవ్ అయిన విద్యార్థులంతా తోటగరువు హైస్కూల్‌లో చేరకపోవడం గమనార్హం.

తగ్గిన విద్యార్థుల సంఖ్య

ప్రస్తుతం తోటగరువు హైస్కూల్‌లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. గత విద్యా సంవత్సరం (2024 – 25)లో ఇక్కడ ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు 1,415 మంది విద్యార్థులుండేవారు. వారిలో 356 మంది పదో తరగతి విద్యార్థులు రిలీవయ్యారు. ప్రస్తుత విద్యా సంవత్సరం (2025 – 26)లో 1,325 మంది విద్యార్థులున్నారు. గత విద్యా సంవత్సరం కంటే ప్రస్తుతం 90 మంది విద్యార్థులు తగ్గిపోయారు. దీంతోపాటు కొత్తగా విద్యార్థుల ప్రవేశాలు కూడా తగ్గిపోయాయి. గత ఏడాది ఇక్కడ సుమారు 480 వరకు కొత్త విద్యార్థులు చేరగా ఈ విద్యా సంవత్సరంలో ఇంత వరకు 320 మంది మాత్రమే చేరారు. దీన్నిబట్టి గత ఏడాది కంటే ఈ ఏడాది కొత్త ప్రవేశాల్లో 160 మంది విద్యార్థులు తగ్గిపోయారు.

ఉపాధ్యాయులను తగ్గించేసిన సర్కార్

విద్యా విధానంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న మార్పులు బోధనకు, విద్యార్థులకు చేటుగా మారుతున్నాయి. దీని కారణంగా పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య తగ్గిపోతోంది. ఇందులో భాగంగా తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. గత ఏడాది వరకు ఇక్కడ 60 (1 ప్లస్ 59) మంది స్కూల్ అసిస్టెంట్లు ఉండేవారు. వారిలో ఇద్దరు మృతి చెందగా, మరో నలుగురు ఉద్యోగ విరమణ పొందారు. 2025–26 విద్యా సంవత్సరానికి మిగిలిన 54 మందిలో విద్యా విధానంలో చేసిన నిష్పత్తి మార్పు ఆధారంగా ఇటీవల జరిగిన బదిలీ ల్లో మరో 7 పోస్టులు ఎగిరిపోయాయి. దీంతో మొత్తంగా ఇక్కడ 13 పోస్టులు తగ్గిపోగా 47 (1 ప్లస్ 46) మంది స్కూల్ అసిస్టెంట్లు మిగిలారు. అన్ని సబ్జెక్టులకు ఇద్దరేసి చొప్పున తగ్గిపోయారు. దీంతో ఉపాధ్యాయులకు గతం కంటే పీరియడ్లు పెరిగాయి. పీరియడ్లు పెరగడంతో ఉపాధ్యాయులపై పని భారం పడిందని లోలోపల మథనపడుతున్నారు. గతంలో ఉన్న విద్యార్థులు, ఉపాధ్యా యుల 40:1 నిష్పత్తిని ప్రస్తుతం 49:1 నిష్పత్తికి కూటమి ప్రభుత్వం పెంచేసింది. దీంతోపాటు విద్యార్థుల ప్రవేశాలు కూడా తగ్గిపోయాయి. ఫలితంగా ఉపాధ్యాయులు సంఖ్య తగ్గిపోయింది. వేలాది మంది విద్యార్థులకు ఉపయోగపడే ఈ హైస్కూల్‌ను మరింతగా అభివృద్ధి చేయాలని, విద్యార్థులు చేరేలా చర్యలు చేపట్టడంతోపాటు ఉపాధ్యాయులనూ పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

మోసపూరిత హామీలపై ప్రభుత్వాన్ని నిలదీయండి

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు


సమావేశంలో మాట్లాడుతున్న మొల్లి అప్పారావు

ఎంవీపీ కాలనీ : ఎన్నికల సమయంలో ఇచ్చిన మోసపూరిత హామీలపై కూటమి నేతలను నిలదీయాలని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ప్రజలకు సూచించారు. జీవీఎంసీ 18వ వార్డు అప్పుఘర్‌లో శనివారం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. ఓటర్లను మోసం చేసి అడ్డదారిలో గద్దెనెక్కేందుకే కూటమి నాయకులు మోసపూరిత హామీలు ఇచ్చారన్నారు. ఆ హామీలను నెరవేర్చకుంటే ఊరుకునేది లేదంటూ కూటమి నాయకులను ప్రజలు నిలదీయాలని పేర్కొన్నారు. ఇందుకు అనుగుణంగా కూటమి మోసాన్ని పార్టీ శ్రేణులు ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పేర్ల విజయచందర్, జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు వాసుపల్లి ఎల్లాజీ, జిల్లా లీగల్ సెల్ నాయకుడు రమణమూర్తి, మారుపల్లి పరదేశి, సూరాడదాసు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రక్తదాన శిబిరానికి స్పందన


రక్తదాన శిబిరంలో రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, తదితరులు

బీచ్‌రోడ్డు : జీవీఎంసీ 28వ వార్డులోని దసపల్లా హిల్స్‌లో గల మార్ ది చర్చిలో శనివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ రక్తదాన శిబిరాన్ని రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో థామస్ వికార్, మాజీ కార్పొరేటర్ రవి రాజు పాల్గొన్నారు..

ఆకట్టుకున్న హరికథ భాగవతం

మద్దిలపాలెం : కళాభారతి ఆడిటోరియంలో విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హరికథ ఉత్సవాల్లో రెండో రోజు శనివారం 'దాన వీర శూర కర్ణ' హరికథను ప్రముఖ భాగవతార్ జేజీ నారాయణ చక్కటి హావభావాలతో రక్తికట్టించి అందరి మన్ననలు పొందారు. ముందుగా వీఎండీఏ అధ్యక్షుడు మంతెన సత్యనారాయణ రాజు, కార్యదర్శి రాంబాబు, పప్పు హనుమంతరావు, పేరాల బాలమురళీకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు.

జీసీసీ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి


సమావేశంలో జీసీసీ కాంట్రాక్ట్ ఉద్యోగులు

ఎంవీపీ కాలనీ : జీసీసీ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని గిరిజన ఉద్యోగుల సంఘాలు డిమాండ్ చేశాయి. జీసీసీ కాంట్రాక్ట్ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ మేరకు సంఘం ఉద్యోగులు ఎంవీపీ కాలనీ గిరిజన భవన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో డిమాండ్ చేశారు. సుమారు 15 నుంచి 18 ఏళ్లుగా జీసీసీలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా సేవలు అందిస్తున్నప్పటికీ ప్రభుత్వం రెగ్యులరైజ్ చెయ్యకుండా వేధిస్తోందన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ యాక్ట్ 30/2023 ప్రకారం రెగ్యులరైజ్ చేయాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జీసీసీ కాంట్రాక్ట్ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు. పలు గిరిజన సంఘాల నాయకులు వీరికి మద్దతు పలికారు.

ఆపరేషన్ కగార్ నిలిపేయాలని డిమాండ్

కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపిన ప్రజా సంఘాల నాయకులు


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

బీచ్‌రోడ్డు: కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులు, ఆదివాసీలను హత మార్చడం ఆపాలని పౌర, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు శనివారం శాంతి ర్యాలీ జరిగింది. ఇందులో పెద్ద సంఖ్యలో ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. విరసం ప్రతినిధి పినాకపాణి మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని గత మూడు నెలలుగా దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య, లౌకిక, వామపక్ష, విప్లవ శక్తులు డిమాండ్ చేస్తున్నాయని అన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో ఖనిజ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 2024 జనవరి 1న ఆపరేషన్ కగార్ ప్రారంభించిందని తెలిపారు. మావోయిస్టుల ఆధ్వర్యంలో ఆదివాసీలు దీనికి వ్యతిరేకంగా పోరాడుతున్నారని చెప్పారు. ఆపరేషన్ కగార్ పేరుతో జరుగుతున్న హత్యాకాండ మావోయిస్టులకు మాత్రమే సంబంధించినది కాదని, ప్రజలందరూ దీనిపై స్పందించాలని కోరారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ పాకిస్తాన్‌తో యుద్ధం విరమించిన కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలకు రాకపోవడం దారుణమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గు నాయుడు, మానవ హక్కుల వేదిక ప్రతినిధి వి.ఎస్. కృష్ణ, పీఓడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది


సమావేశంలో మాట్లాడుతున్న మొల్లి అప్పారావు.. చిత్రంలో మాజీ మేయర్ హరి వెంకటకుమారి

మాజీ మేయర్ హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు

ఆరిలోవ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగం నడుపుతోందని మాజీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. జీవీఎంసీ పదకొండో వార్డులో శనివారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముందుగా 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వ పాలనా వైఫల్యాలను ప్రజల దృష్టికి ఏ విధంగా తీసుకెళ్లాలో మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సందేశాన్ని స్క్రీన్‌పై కార్యకర్తలకు చూపించారు. అనంతరం మాజీ మేయర్, సమన్వయకర్త మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలనను గాలికి వదిలేసిందన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో కక్ష సాధిస్తోందని ఆరోపించారు. ఈ పాలనలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు, వైఎస్సార్‌సీపీ నాయకులపై దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. ఈ పాలనను అంతమొందించే దిశగా కార్యకర్తలు పనిచేయాలని కోరారు. ప్రజల వద్దకు వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, వార్డు అధ్యక్షుడు ముగడ రమేష్, నియోజకవర్గ మైనారిటీ సెల్ విభాగం అధ్యక్షుడు మక్బుల్, స్థానిక నాయకులు మోహన రావు, అప్పారావు, జహింగీర్, షకీనా, మూర్తి, పద్మ, నిర్మల, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లతో ప్రజలపై ఆర్థిక భారం

ఆరిలోవ : స్మార్ట్ మీటర్లను ప్రభుత్వం రద్దు చేయాలని సీపీఐ ఆరిలోవ జోన్ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో శనివారం ర్యాలీ నిర్వహించారు. సీపీఐ నాయకులు ఎర్ర జెండాలు పట్టుకుని జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి సాయినగర్, లక్ష్మీనగర్‌లో నిరసన తెలిపారు. ర్యాలీగా వెళ్లి స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలకు కలిగే నష్టాన్ని తెలుపుతూ ముద్రించిన కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందజేశారు. స్మార్ట్ మీటర్లు అమర్చడానికి ఇంటికి వచ్చే వారిని తిరిగి పంపించేయాలని, మీటర్లు అమరకుండా అడ్డుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ వీటి వల్ల ప్రజలపై అదనపు భారం పడుతుందన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు హామీ ఇచ్చారని... అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని గాలికొదిలేశారని ఆరోపించారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీల పెంపును తీవ్రంగా వ్యతిరేకించిన చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యాక ఏడాదిలో మూడు సార్లు ప్రజలపై చార్జీల భారం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్.కె.రెహమాన్, జోన్ నాయకులు దేవుడమ్మ, లక్ష్మణరావు, కాసుబాబు, సందీప్ పాల్గొన్నారు.


లక్ష్మీనగర్‌లో వృద్ధురాలికి కరపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

పథకాలపై అవగాహన అవసరం

ఏయూ క్యాంపస్ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, సమస్యల పరిష్కారానికి ప్రవేశ పెట్టిన మార్గాలను ప్రతీ వ్యక్తి తెలుసుకోవాలని ఏపీ ఈపీడీసీఎల్ సీజీఆర్ఎఫ్ ఛైర్మన్ బి.సత్యనారాయణ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫ్లాగ్‌షిప్ పథకాలపై బీచ్ రోడ్డులోని యూత్ హాస్టల్స్ సముదాయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతీ సమస్యకు పరిష్కారం ఉంటుందని, సరైన మార్గంలో వెళ్లడం వల్ల సమస్యలు అధిగమించవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల వివరాలు తెలుసుకుని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ పథకాలపై యువతకు అవగాహన కల్పించారు. మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ జి.మహేశ్వరరావు, ఏవీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రి నాయుడు. డాక్టర్ ఎం.జోగారావు, ఆర్.లీలా ప్రసాద్, కె.శ్రీనివాస్, ఎం.ప్రసన్న లక్ష్మి పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న సీజీఆర్ఎఫ్ ఛైర్మన్ సత్యనారాయణ

రీసెర్చ్, ఇన్నోవేషన్ రంగాల్లో కలిసి పనిచేయాలి

మద్దిలపాలెం : పరిశోధన, ఆవిష్కరణ రంగాల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయంతో కలిసి పని చేయాలని బ్లింకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీని ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ ఆహ్వానించారు. శనివారం ఏయూ పాలకమండలి సమావేశ మందిరంలో బ్లింకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంటర్నేషనల్ డైరెక్టర్ గురుదత్ వేల్పులతో సమావేశమయ్యారు. భవిష్యత్‌లో ఏయూతో స్టూడెంట్స్, ఫ్యాకల్టీ సహకారంపై చర్చించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య రాజశేఖర్ మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయ శతాబ్ది ఉత్సవాలను ప్రారంభించామని, ఇందులో ఏయూతో సంయుక్తంగా బీటీహెచ్ సదస్సులు, కార్యక్రమాలు నిర్వహించాలని ఆహ్వానించారు. స్వీడన్‌కి చెందిన శాస్త్రవేత్తలు, ఆచార్యులు, పరిశోధకులు ఈ సదస్సులో పాల్గొనే విధంగా ప్రణాళిక చేయాలని సూచించారు. నోబెల్ బహుమతి గ్రహీతలు పాల్గొనేలా ప్రణాళిక చేస్తున్నామని తెలిపారు. అనంతరం గురుదత్ మాట్లాడుతూ ఏఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ తదితర రంగాల్లో కీలకంగా పనిచేస్తున్నామని, ఆసక్తి ఉన్న అంశాల్లో రెండు విశ్వవిద్యాలయాలు కలిసి పనిచేయాలని కోరారు. త్వరలో తమ వర్సిటీ తరపున ఏయూను సందర్శిస్తామని తెలిపారు.


సమావేశంలో గురుదత్ వేల్పులతో ఏయూ వీసీ రాజశేఖర్, తదితరులు

ప్లాస్టిక్ నిషేధంతో పర్యావరణ పరిరక్షణ

ఆరిలోవ : స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని పోలీసులు, పారిశుద్ధ్య కార్మికులు శనివారం చేపట్టారు. ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీసుల ఆధ్వర్యంలో విశాలాక్షినగర్ కైలాసగిరి ప్రాంతంలో శనివారం స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్రలో భాగంగా రోడ్లు శుభ్రం చేశారు. అధికారి నుంచి కానిస్టేబుల్ వరకు చీపుర్లు పట్టుకుని రోడ్లు ఊడ్చారు. పార్కింగ్ ప్రదేశాల్లో చెత్త తొలగించారు. పార్కుల్లో చెత్త సేకరించి పారిశుద్ధ్య కార్మికులకు అందజేశారు. అనంతరం బ్యానర్లు పట్టుకుని పర్యావరణం, పరిశుభ్రతపై నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. ప్లాస్టిక్ నిషేధంతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, మన్మథరావు, రమణమూర్తి, ఎస్ఐలు ఆదినారాయణ, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

జీవీఎంసీ పదమూడో వార్డులో పారిశుద్ధ్య కార్మికులు స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టారు. స్థానిక కార్పొరేటర్ కెల్ల సునీత కార్మికులతో కలిసి దుర్గాబజార్, అన్నక్యాంటీన్ ప్రాంతాల్లో ప్రజలకు పర్యావరణం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వారితో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఆరిలోవ కాలనీలో ర్యాలీ చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిలపాలెం : డాక్టర్ వి.ఎస్.క్రిష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని నిర్మూలించడం' అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అధ్యక్షతన ప్లాస్టిక్ నివారణ కోసం విద్యార్థులు రూపొందించిన నమూనాల ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. ఎన్ఎస్ఎస్ జోనల్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.ఉమామహేశ్వర రావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.జయ, జి.వి.ప్రతాప్, బి.లక్ష్మి, డాక్టర్ బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు

స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని నిర్మూలించడం' అనే అంశంపై శనివారం శివాజీపాలెంలో గల ఏయూ ఫైన్ ఆర్ట్స్ విభాగంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఏయూ రిజిస్ట్రార్ ఇ.ఎన్.ధనుంజయరావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహరావు, ఎన్ఎస్ఎస్ విభాగం కో ఆర్డినేటర్ సింహాచలం పాల్గొన్నారు.


విశాలాక్షినగర్‌లో ర్యాలీలో ఏఆర్ పోలీసులు

ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా నిషేధించాలి

బీచ్‌రోడ్డు : ప్లాస్టిక్ వినియోగాన్ని అందరూ పూర్తిగా నిషేధించాలని జీవీఎంసీ 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి సురేష్ అన్నారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని వార్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ గోనె, గుడ్డ సంచులు వినియోగించాలని కోరారు.

ఎంవీపీ రైతు బజార్‌లో...

ఎంవీపీ కాలనీ : స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ఎంవీపీ కాలనీ రైతు బజార్‌లో ప్లాస్టిక్ నిర్మూలనపై శనివారం అవగాహన కల్పించారు. రైతులు ఉత్సాహంగా పాల్గొని ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ ప్రతి స్టాల్‌కి వెళ్లి ప్లాస్టిక్ నిర్మూలన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్‌కు బదులుగా నార సంచులు, క్లాత్ సంచులు వాడాలని వినియోగదారులకు, రైతులకు అవగాహన కల్పించారు. దీంతోపాటు రైతు బజార్‌లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించి బజారు పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో రైతు బజార్ ఈవో వరహాలు, సహాయకుడు కనకరాజు, జిల్లా లీగల్ సర్వీసెస్ ప్యానల్ అడ్వకేట్ శ్రీలక్ష్మి, పారా లీగల్ వలంటీర్ భవాని పాల్గొన్నారు.


పదమూడో వార్డులో ర్యాలీలో పారిశుద్ధ్య కార్మికులు


అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ మువ్వల లక్ష్మి సురేష్


రైతుబజార్‌లో బ్యానర్లు ప్రదర్శిస్తున్న ఈవో, రైతులు

మంచినీటి బోరు ఏర్పాటు


బోరు వేయిస్తున్న కార్పొరేటర్ మువ్వల లక్ష్మి

బీచ్‌రోడ్డు : జీవీఎంసీ 20వ వార్డు చిన వాల్తేరులోని రజక సామాజిక భవనంలో కార్పొరేటర్ నిధులతో మంచి నీటి బోరును శనివారం వేయించారు. 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 20వ వార్డులోని ప్రజలు, రజక సంఘం అవసరాల మేరకు బోరు వేయించానని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 20వ వార్డు అధ్యక్షుడు యనమరెడ్డి కుమార్ రెడ్డి, రజక సంఘం అధ్యక్షుడు పాలకొల్లు రాంబాబు, ఉపాధ్యక్షుడు గంటా అప్పారావు, కార్యదర్శి పాలకొల్లు గంగాధర్, సహాయ కార్యదర్శి పాలకొల్లు నాని బాబు, పాలకొల్లు సీతారాం, కొనడ సత్తి రాజు సురేష్, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు కాగితాల రవి కిరణ్ రెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు పిలక తరుణ్ రెడ్డి పాల్గొన్నారు.

బాలుర గృహానికి చెస్ బోర్డుల పంపిణీ

ఆరిలోవ : జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి దీన్‌దయాల్‌పురంలోని ప్రభుత్వ బాలుర గృహాన్ని ఆంధ్రా చెస్ అకాడమీ (ఏసీఏ) అధ్యక్షుడు అడుసుమిల్లి సురేష్ శనివారం సందర్శించారు. ఇక్కడి బాలురకు చెస్ బోర్డులు, వాటికి సంబంధించిన సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ చెస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వారం రోజులపాటు ఏసీఏ అనుబంధ సంస్థలతో కలిసి జిల్లాలో చెస్‌కు సంబంధించిన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న విద్యార్థులకు కూడా చెస్ ఆటను పరిచయం చేసే ప్రయత్నంలో భాగంగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. చెస్ ఆట వల్ల జ్ఞాపక శక్తి పెరుగుదల, నిర్ణయాలు తీసుకోవడం, ఆలోచనలో సామర్థ్యం పెరుగుతుందన్నారు. క్రమశిక్షణకు చెస్ శక్తివంతమైన సాధనమన్నారు. ఆలోచన ధోరణిలో సానుకూల మార్పును తీసుకొస్తుందన్నారు. చిన్నారులు చెస్‌పై ఆసక్తి కనబరచాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీఏ ప్రతినిధులు, కెన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పి.సంతోష, బాలుర గృహం పర్యవేక్షణాధికారి రమణ, సిబ్బంది పాల్గొన్నారు.


చెస్ బోర్డులు అందజేస్తున్న ఏసీఏ అధ్యక్షుడు సురేష్, తదితరులు

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఆందోళన

డాబాగార్డెన్స్: అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, శానిటేషన్ కాంట్రాక్టర్ దుర్మార్గపు విధానాలు విడనాడాలని, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం మానాలని సిటు ఆధ్వర్యంలో శనివారం కేజీహెచ్ మెయిన్ గేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిటు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం రూ.16 వేలు జీతం శానిటేషన్ వర్కర్లకు ఇవ్వాలని, ఈఎస్ఐ సక్రమంగా కట్టాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిటు సీనియర్ నాయకులు వై.రాజు, ఎం.సుబ్బారావు, జోన్ కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలపై వినతి

మద్దిలపాలెం : ఏయూ కాంట్రాక్ట్ అధ్యాపకుల బృందం తమ సమస్యలపై మంత్రి నిమ్మల రామానాయుడు, జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్‌కు శనివారం వినతిపత్రాలు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్, ఆంధ్ర యూనివర్సిటీ టీచర్స్ కాంట్రాక్ట్ అసోసియేషన్ సంయుక్తంగా ఒప్పంద అధ్యాపకుల వేదనను మంత్రికి వివరించారు. హైకోర్టు తీర్పును ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జనవరిలో జీవో నంబర్ 2ను టైం స్కేల్ అమలు చేయమని విడుదల చేస్తే ఇప్పటికీ అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నారని మంత్రికి తెలిపారు. విషయాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తానని మంత్రి రామానాయుడు పేర్కొన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోడి అర్జునుడు, కోట పల్లవి, అలీ, వృంద్రుకొండ హరీష్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆరిలోవ : జీవీఎంసీ పదమూడో వార్డులో పలు అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపనలు చేశారు. వార్డు పరిధి దారపాలెం బంగారమ్మతల్లి లే అవుట్, సింహాద్రి లే అవుట్, ఏఎస్ఆర్ లే అవుట్‌లలో రూ.2.79 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శంకుస్థాపన చేశారు. ఆయాచోట్ల పనులను తొందరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్ కెల్ల సునీత, జీవీఎంసీ ఏఈ సురేష్, నాయకులు పాల్గొన్నారు.